

మెదక్ చర్చిలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## శాంతికి ప్రతీక మెదక్ చర్చి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మెదక్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : శాంతికి ప్రతీక మెదక్ చర్చి అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. మెదక్ చర్చి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు, గవర్నర్ కార్యదర్శి దాన కిషోర్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేశ్, ప్రెస్ బ్రీటర్ ఇన్‌చార్జి శాంతయ్య పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ నాయకులు

**గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే జాజాల**



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 22: కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం వాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం ఎల్లారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో వీరు బీఆర్ఎస్‌లో చేరగా.. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాజాల మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోతుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు.

## సింగరేణి సీఎండీ డిప్యూటేషన్ పొడిగింపు



హైదరాబాద్, డిసెంబర్22 (నమస్తే తెలంగాణ): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీగా అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఫైనాన్స్ డైరెక్టర్ బలరాం నాయక్ డిప్యూటేషన్‌ను మరో ఏడాది పాటు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఆయననే పూర్తిస్థాయి సీఎండీగా నియమించే అవకాశం కూడా ఉన్నట్టు తెలుస్తున్నది.

## ప్రయాణికుల ఫిర్యాదులపై దృష్టి

**భద్రతా అంశాలపై రైల్వే అధికారుల సమీక్ష**

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్రయాణికులు చేసే ఫిర్యాదుల పరిష్కారంపై రైల్వే అధికారులు దృష్టి సారించారు. రైళ్లలో ఏర్పాటు చేసిన కనీస సౌకర్యాలు, భద్రత వంటి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) సమన్వయంతో నేరాలను తగ్గించే వ్యూహాలు, మెరుగైన రైల్వే భద్రత కోసం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ జోనల్ మేనేజర్లతో చర్చించారు. రానున్న రోజుల్లో రైల్వే భద్రత అంశాలపై కీలకంగా వ్యవహరించాలని ఆర్‌పీఎఫ్ అధికారులకు మంత్రి సూచించారు. ఈ మేరకు జీఆర్‌పీ ఉన్నతాధికారుల 5వ అఖిల భారత సమావేశంలో ఈ అంశాలపైనా చర్చించినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

# సిరులవేణి.. సింగరేణి!

- 104 ఏండ్ల సుదీర్ఘ ప్రస్థానం
- నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం
- సంస్థను వెంటాడుతున్న సమస్యల సవాళ్లు



హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బొగ్గు పేరెత్తగానే సింగరేణియే గుర్తుకొస్తుంది. నల్లబంగారానికి సింగరేణి పర్యాయపదమైంది. అంతలా ప్రసిద్ధి పొందిన సింగరేణి.. ఆవిర్భవించి నేటికి 104 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం సింగరేణి వ్యాప్తంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. కొత్తగూడెంలో నిర్వహించనున్న వేడుకల్లో సంస్థ సీఎండీ బలరాం పాల్గొననున్నారు. బొగ్గు వెలికితీతే ప్రధాన బాధ్యతగా ఆవిర్భవించిన సింగరేణి వ్యాపార విస్తరణ, తదితర అనేక రంగాల్లోనూ పయనిస్తున్నది. కొత్త గనులనూ చేపట్టనున్నది. ఒడిశా నైనీ కోల్‌బ్లాక్, కొత్తగూడెంలో వీకే ఓసీ, ఇల్లందులో రొంపేడు ఓసీ, గోలేటి ఓసీల్లో ఉత్పత్తిని ప్రారంభించనున్నది. కొత్తగూడెంలో వెంకటేశ్ ఖని, ఇల్లందులో జవహర్‌ఖని గనులకు అనుమతలు పొందింది. రామగుండంలో 500 మోగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పనున్నది. ఇటీవలే కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి సంకల్పించింది.

**ఇతర ఖనిజ తవ్వకాలపైనా గురి**

లిథియం సహా ఇతర ఖనిజాల తవ్వకాలపైనా సింగరేణి దృష్టిపెట్టింది. జియోథర్మల్, గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియం నైట్రేట్ తయారీకి చర్యలు చేపట్టింది. టీజీ జెన్‌కోతో కలిసి రామగుండంలో కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ను నిర్మించనున్నది. రాజస్థాన్‌లో సోలార్ ప్లాంట్‌ను నిర్మించనుంది. ఇంతటి ఘనకీర్తిని కలిగిన సింగరేణిని పలు సమస్యలు వెన్నాడుతున్నాయి.

**సమస్యలు.. సవాళ్లు!**

- సింగరేణిలో మొత్తం 40 గనులుంటే 22 భూగర్భ గనులే. వీటిలో ఉత్పాదక వ్యయం అధికం కావడంతో ఏటా రూ.3 వేలకోట్లు నష్టాలొస్తున్నాయి.
- కొత్తగా ఉత్పత్తి ప్రారంభించాల్సిన గనులకు కేంద్ర అటవీ మంత్రిత్వశాఖ నుంచి సకాలంలో అనుమతులు రావడం లేదు. ఈ కారణంతోనే నైనీ కోల్‌బ్లాక్ నాలుగేండ్లుగా ముందుకుసాగడం లేదు.
- ఉత్పత్తి నిరుడు 72 మిలియన్ టన్నులు ఉండగా, ఈ ఏడాది 74 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకున్నది. ఆర్థిక సంవత్సరానికి ఇంకా 100 రోజులే గడువు ఉండగా, రోజుకు 2.7 లక్షల టన్నుల బొగ్గును వెలికితీస్తేనే లక్ష్యం పూర్తవుతుంది.
- కార్మికుల గైర్హాజరు, పనిగంటలు సైతం బొగ్గు ఉత్పత్తి, సంస్థ ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపుతున్నాయి. 2024 జనవరి నుంచి అక్టోబర్ వరకు 300 రోజుల్లో 75 రోజులు కూడా పనిచేయని కార్మికుల సంఖ్య 1,892గా తేలింది. పలువురు కార్మిక సంఘాల నేతలు డుమ్మాలు కొడుతున్నారు.
- యంత్రాల వినియోగంలోనూ చెప్పుకోదగిన పురోగతి లేదు. యంత్రాలను 18 గంటలు నడపాలని సంస్థ వర్గాలు పదే పదే ఆదేశాలిస్తున్నాయి.
- బొగ్గు గనుల్లో ప్రమాదాలు, కార్మికుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏటా పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు.
- కారుణ్య నియామకాల్లో అక్రమాలు సంస్థకు మాయనిమచ్చను తెచ్చిపెట్టాయి. ఈ అక్రమాలపై సీఐడీ విచారణ జరిపింది.
- వర్షాలు, వరదలు సైతం బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయి. భారీ వర్షాలతో ఓపెన్‌కాస్టుల్లో నీరు చేరుతున్నది. ఈ నీటి తొలగింపు పెద్ద సమస్యగా మారుతున్నది.

# ‘ప్రయోగానికి’ పాతర

## జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రాక్టికల్స్‌కు మంగళం

- నిధుల మంజూరులో సర్కారు నిర్లక్ష్యం
- వేధిస్తున్న మెటీరియల్స్, రసాయనాల కొరత
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 56 కాలేజీల్లోనూ ఇదే దుస్థితి
- ఏం చేయలేని పరిస్థితిలో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు
- ఉన్న సౌకర్యాలతో తూతూమంత్రంగా అవగాహన
- పిల్లల భవిష్యత్ దెబ్బతినే ప్రమాదం
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఆవేదన



కోరుట్ల మండలం కల్లూరులోని కస్తూర్బా జూనియర్ కాలేజీలో ప్రాక్టికల్ గది

**ప్రభుత్వ కాలేజీ విద్య అధ్వానంగా మారింది. సర్కారు నిర్లక్ష్యం.. పేద పిల్లలకు శాపంగా పరిణమించింది. నేటి పిల్లలను భావిభారత శాస్త్రవేత్తలుగా నిలిపేందుకు సర్కారు జూనియర్ కళాశాలల్లో ఏటా నిర్వహించే ప్రయోగాలను ప్రభుత్వం పాతరేస్తున్నది. ‘ప్రభుత్వ విద్యను పటిష్టం చేస్తాం. కార్పొరేట్‌కు సంస్కరిస్తాం’ అని ఓ వైపు బీరాలు పలుకుతూనే, మరోవైపు ప్రాక్టికల్స్‌కు అవసరమైన కనీస నిధులు మంజూరు చేయకపోవడంతో విద్యా సంవత్సరం పూర్తికావస్తున్నా నిర్వహణ అటకెక్కింది. మెటీరియల్స్, రసాయనాల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. జగిత్యాల జిల్లా ఒక్కటే కాదు ఉమ్మడి జిల్లాలోని 56 కాలేజీల్లో ఇదే దుస్థితి ఉండగా, ప్రిన్సిపాళ్లు, అధ్యాపక బృందం ఏదో ఉన్న సౌకర్యాలతో తూతూ మంత్రంగా అవగాహన కల్పిస్తూ మమ అనిపిస్తున్నది. ఇదిలాగే కొనసాగితే పిల్లల భవిష్యత్ దెబ్బతినే ప్రమాదం పొంచి ఉండగా, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.**

జగిత్యాల, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ‘ప్రభుత్వ విద్యను పటిష్టం చేస్తాం. కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలకు దీటుగా వాటిని సంస్కరిస్తాం. ప్రతి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజీలే కాదు. విద్యా సంస్థ ఏదైనా సరే వాటన్నింటిలో అవస్థాపన సౌకర్యాలు కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన, ప్రయోగాత్మకమైన, పరిశీలనాత్మకమైన, గుణాత్మకమైన విద్యను అందిస్తాం’ అంటూ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రసంగాలు చేయడమే గానీ క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధమైన పరిస్థితులున్నాయని విద్యార్థులు, ఉపన్యాసకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు సంబంధించి వార్షిక పరీక్షల తేదీలు, ప్రాక్టీకల్ పరీక్షల తేదీల ప్రకటన జరిగిందని, అయినా ఇంత వరకు విద్యార్థులకు ప్రాక్టికల్స్ పూర్తిస్థాయిలో నిర్వహించే పరిస్థితిలో లేమని లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తమ బతుకులు ఇంతేనని, పేదరికంలో పుట్టినందుకు ఎందుకు పనికిరాని చదువు చదువుకోవాల్సిందేనని, కనీసం ప్రాక్టీకల్స్ సైతం పూర్తిస్థాయిలో నేర్చుకునే స్థితి లేదని విద్యార్థులు బాధపడుతున్నారు. విద్యా సంవత్సరం పూర్తిగా గడిచిపోతున్నా, ఒక వైపు ప్రాక్టికల్ పరీక్షలకు కావాల్సిన రికార్డులను పిల్లలతో లెక్చరర్లు రాపిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ప్రయోగాలు నిర్వహించేందుకు మెటీరియల్ కొరత నెలకొనడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్నది.

**ప్రాక్టికల్స్ నిర్వహణకు నిధులేవి..?**

విద్యా సంవత్సరం పూర్తికావస్తున్నా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రాక్టికల్స్ నిర్వహణ నిధులు ఇప్పటికీ మంజూరు కాలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 56 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా, అన్నింటా మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బాటనీ కోర్సులతో కూడిన ఎంపీసీ, బైపీసీ కోర్సులు నడుస్తున్నాయి. ఇవి కాకుండా కొన్ని కాలేజీల్లో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎమ్ఎల్‌టీ, ఫిషరీస్, రేడియో అండ్ టీవీ, సీజీడీఎం వంటి వృత్తి విద్యా కోర్సులు చెబుతున్నారు. ఎంపీసీ, బైపీసీ సెక్షన్లకు సంబంధించి ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బాటనీ సబ్జెక్టులకు సెకండియర్‌లో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించడం అందరికీ తెలిసిందే. శాస్త్ర, సాంకేతిక కోర్సులపై పిల్లలకు ఇక్కడే అవగాహన, ఆసక్తిని కల్పించాల్సిన అవసరం ఉంటుంది. పిల్లలకు నేరుగా ప్రాక్టికల్స్ చేయించి వారిని భవిష్యత్తుల్లో శాస్త్రవేత్తలుగా, వైద్యులుగా తయారు చేసేందుకు వేదికగా జూనియర్ కాలేజీ ప్రాక్టికల్ ల్యాబ్‌లు పనికివస్తాయి. ఇంటర్ స్థాయిలో ఎంపీసీ, బైపీసీ చదివే విద్యార్థులకు 40 శాతం మార్కులు ప్రాక్టికల్స్ ద్వారానే లభిస్తాయి. అలాగే వృత్తివిద్యా కోర్సు చదివే వారికీ దాదాపు 50 శాతం మార్కులు ఉన్నాయి. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ప్రభుత్వం ఇంటర్ కాలేజీల్లో ప్రాక్టికల్స్ కోసం నిధులను కేటాయిస్తుంది. ఈ ఫండ్స్ నుంచే ప్రిన్సిపాల్, లెక్చరర్లు, ప్రాక్టికల్ మెటీరియల్స్ కొనుగోలు చేస్తారు. కెమిస్ట్రీకి సంబంధించిన వివిధ రకాల కెమికల్స్, యాసిడ్స్, జువాలజీ, బాటనీకి సంబంధించిన సూక్ష్మదర్శినీల స్లైడ్స్, పిప్పెట్లు, బ్యూరెట్లు అలాగే ఫిజిక్స్‌కు, వృత్తి విద్య కోర్సులకు సంబంధించిన ప్రాక్టికల్ మెటీరియల్స్ కొనుగోలు చేస్తారు. సహజంగా ప్రతి ఏడాది రూ.25వేలు తక్కువలో తక్కువ జూనియర్ కాలేజీల్లో ప్రాక్టికల్స్‌కు కేటాయిస్తారు. అయితే విద్యా సంవత్సరం దాదాపు పూర్తి కావచ్చింది. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరిలో నిర్వహించేందుకు టైమ్‌టేబుల్ జారీ అయ్యింది. అలాగే పిల్లలను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఇంటర్‌బోర్డు 90 రోజుల ప్రణాళికను అమలు చేస్తోంది. అయితే ఇంత వరకు ప్రాక్టికల్స్ చేయించేందుకు మాత్రం నిధులు మంజూరు కాకపోవడం, మెటీరియల్ కొరత వేధిస్తుండడంతో ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు తూతూ మంత్రంగా ప్రయోగాలు నిర్వహించాల్సిన దుస్థితి దాపురించింది.

**సర్వశిక్షా అభియాన్ విద్యా సంస్థల్లో కొంత నయం**

ప్రభుత్వ జూనియర్ కాలేజీలతో పోల్చుకుంటే, సర్వశిక్ష అభియాన్ నిధులతో నడుస్తున్న ఇంటర్మీడియెట్ విద్యా సంస్థల్లో పరిస్థితి మెరుగ్గా కనిపిస్తోంది. మోడల్ స్కూల్స్‌తో పాటు, గురుకుల పాఠశాలలు, మైనార్టీ, సోషల్, గిరిజన గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ప్రాక్టికల్స్ మెటీరియల్స్ కొంత మొత్తంలో అందుబాటులో ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ఈ కాలేజీలకు ప్రభుత్వం ఒక్క రూపాయిని కేటాయించలేదు. అయితే గతంలో ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు ఇవ్వడంతో మెటీరియల్స్ అధికంగా కొనుగోలు చేసి పెట్టారు. వాటితోనే ఈ ఏడాది ప్రాక్టీకల్స్ నిర్వహిస్తున్నామని గురుకులాలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా విద్యాలయాల ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు. గతంలో నిధులు ఎక్కువగా రావడం, మెటీరియల్ సైతం రెండుమూడేండ్లకు సరిపోయేలా ప్రభుత్వం కేటాయించడంతో పరిస్థితి మెరుగ్గా ఉందని, లేకుంటే తమకు సైతం తిప్పలు ఉండేవని చెబుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి మెటీరియల్‌కు నిధులు రాకపోతే తమకు సైతం ఇబ్బందేనని అంటున్నారు.

**కేసీఆర్ హయాంలో మౌలిక వసతుల కల్పన**

ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కేసీఆర్ హయాంలో ఒక రకంగా స్వర్ణయుగాన్ని అనుభవించాయి. కాలేజీల్లో అనేక మౌళిక వసతులు సమకూరాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 56 జూనియర్ కాలేజీలకు అవస్థాపన సౌకర్యాల కల్పనకు నిధులను మంజూరు చేసింది. ప్రతి కాలేజీలోనూ అదనపు తరగతి గదులు, ప్రహరీలు, మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పించింది. ఇక విద్యాపరమైన విషయాల్లో ప్రతి కాలేజీకి గ్రంథపాలకుడు, క్రీడా ఉపన్యాసకుడి పోస్టులను మంజూరు చేసింది. ప్రతి జూనియర్ కాలేజీకి రూ.2.50లక్షల విలువైన క్రీడా సామగ్రిని కొనుగోలు చేసి అందజేసింది. అలాగే ప్రతి కాలేజీకి రూ.4 లక్షల వ్యయంతో నాలుగు ప్రయోగశాలలు, వాటితో పాటు, రసాయన పరికరాలను సైతం అందజేసింది. ప్రతి కాలేజీలోనూ ఆన్‌లైన్ పద్ధతిలో హాజరు విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇక డిగ్రీ కాలేజీల్లోనూ పూర్తి సౌకర్యాలు కల్పించారు. క్లస్టర్ విధానాన్ని అమల్లోకి తెచ్చి కాలేజీలను సర్క్యూట్లుగా మార్చివేశారు. అలాగే ప్రతి కాలేజీకి టాస్క్ ద్వారా బోధన చేయించి క్యాంపస్ ఇంటర్వ్యూలకు అవకాశం కల్పించారు.

**ప్రాక్టికల్స్‌కు నిధులు మంజూరు చేయాలి..**

ప్రాక్టికల్స్ నిర్వహణ కోసం నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు, విద్యార్థులు కోరుతున్నారు. అత్యంత కీలకమైన దశ అయిన ఇంటర్మీడియెట్‌లో ప్రాక్టికల్స్ నిర్వహించకపోతే సబ్జెక్టులపై అవగాహన కలుగదని, పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందని వాపోతున్నారు. ఇదిలా ఉంటే తాము 40 శాతం మార్కులు నష్టపోయే ప్రమాదం ఉందని, ఆర్థిక స్థోమత లేకనే ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్నామని, తమ పరిస్థితిని అర్థం చేసుకొని నిధులు కేటాయించి, తమ జ్ఞానసముపార్జనకు సహకరించాలని పిల్లలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఇంకెన్నాళ్లీ వెట్టిచాకిరీ?



- అటకెక్కిన ఎన్నికల హామీ
- ‘ఉపాధి’ సిబ్బందికి అందని ద్రాక్షలా పేస్కేలు

**తాము గెలిస్తే ఉపాధి హామీ సిబ్బంది పేస్కేలు అమలు చేస్తామంటూ, అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అటకెక్కింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ‘ఇంకెన్నాళ్లీ వెట్టిచాకిరీ’ అంటూ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. పలుసార్లు ప్రభుత్వ పెద్దలను కలిసి, వినతిపత్రాలు అందజేసినా, అవి బుట్టదాఖలు కావడంతో ప్రభుత్వ హామీలు నీటి మూటలుగా మారుతున్నాయంటూ మండిపడుతున్నారు.**

కరీంనగర్ కలెక్టరేట్, డిసెంబర్ 22 : దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఒప్పంద విధానంలో విధుల్లో చేరిన ఉపాధిహామీ సిబ్బంది, ఎన్నటికైనా తమను క్రమబద్ధీకరిస్తారనే ఆశతో విధుల్లో కొనసాగుతున్నారు. అయితే, అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పే స్కేలు అమలు చేస్తామని హామీ ఇవ్వడంతోపాటు లోక్‌సభ ఎన్నికలకు ముందు శాఖల వారీగా సమీక్షలు నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయమై మరోసారి ప్రకటించడంతో సంతోషపడ్డారు. తర్వాత పట్టించుకోకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీరిలో వందలాది మంది 55 ఏళ్లకు పైబడడంతో ఇక తాము ట్రెజరీ ద్వారా వేతనం పొందడం కలగానే మిగిలుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా నామమాత్రపు వేతనాలు ఇవ్వడం, అవి కూడా నెలనెలా సక్రమంగా అందకపోవడంతో తమ కుటుంబాలను సాకడం కష్టంగా మారుతోందని ఆందోళన చెందుతున్నారు. ఉన్న జీతంలోనే అత్యంత పొదుపుగా జీవితాలను నెట్టుకొస్తున్నా, ఇచ్చిన మాట నిలుపుకోకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వెల్లగక్కుతున్నారు. పేస్కేలు అమలు చేస్తే ఒక్కో ఉద్యోగికి కనీసం ₹10వేల నుంచి ₹16వేల వరకు వేతనాలు పెరిగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 3500 మంది వరకు ఉపాధి ఉద్యోగులుండగా, వీరంతా పేస్కేలు అమలు చేయాలంటూ పలుసార్లు హైద్రాబాద్‌లోని ప్రజాభవన్‌కు కూడా తరలివెళ్లారు. ప్రజాదర్బార్‌లో పలువురు మంత్రులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయాలంటూ మంత్రి సీతక్కను కూడా కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆమె హామీ ఇచ్చినా, ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా తమ పట్ల కరుణించాలని, లేనిపక్షంలో వరుస ఆందోళనలకు కరీంనగర్ వేదికగా మారుతుందని హెచ్చరిస్తున్నారు.

## ‘నాగంపేట’పై ఉన్నతాధికారుల నజర్!

జమ్మికుంట, డిసెంబర్22 : మండలంలోని నాగంపేట గ్రామ పంచాయతీపై జిల్లా ఉన్నతాధికారులు నజర్ పెట్టినట్లు తెలిసింది. ఆరునెలల క్రితం నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి జీపీకి వచ్చిన నిధులు, జరిగిన అభివృద్ధి పనులు, తదితర అంశాలపై సమాచారం హక్కు చట్టం కింద వివరాలు కోరగా.. ఇప్పటి వరకు మండలస్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శి స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు, సిబ్బంది పనితీరుపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం పనిచేస్తున్న కార్యదర్శి అంకూస్‌కు బదులుగా.. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన కార్యదర్శి శ్రీనివాస్ ‘నేనే కార్యదర్శిని’ అంటూ ఆర్టీఐ అర్జీదారుడు నాగేశ్వర్‌రావుకు లేఖ ద్వారా సమాధానం ఇవ్వడం వివాదాస్పదమైంది. ఇదే విషయాన్ని ఈ నెల 18న ‘నమస్తే’లో ‘కార్యదర్శి ఒకరు.. సమాధానం మరొకరిది’ కథనం కూడా వచ్చింది. దీనిపై ఎంపీడీవో భీమేశ్, ఎంపీవో వెంకటేశ్వర్లు స్పందించినట్లు చేశారు. ‘కార్యదర్శులిద్దరిదీ తప్పే..’ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. కార్యదర్శులిద్దరూ కూడబలుక్కొని తప్పుచేసినట్లు కళ్ల ముందు కనిపిస్తుంటే చర్యలు తీసుకోలేదు సరికదా.. కనీసం క్షేత్రస్థాయిలో విచారణ కూడా చేయలేదని తెలిసింది. మండలాధికారులు ‘మామూలు’గా తీసుకోవడంపై సర్వత్రా అనుమానాలకు తావిస్తున్నది. ఇంతలా కార్యదర్శులను మండలాధికారులు వెనకేసుకురావడంలో మతలబు ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కార్యదర్శుల పరస్పర సహకారం.. మండలాధికారుల చర్యలు తీసుకోవడంలో వెనుకంజ.. తదితర అంశాలపై ఇప్పటికే పలువురు డీపీవో రవీందర్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. సదరు ఘటనలపై జిల్లా అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా మండల అధికారులు, కార్యదర్శులు ప్రస్తుత విషయంపైనే కాకుండా గతంలో వచ్చిన ఆరోపణలపై నేడు ప్రజావాణితో పాటూ రాష్ట్ర స్థాయిలోని ఓ ఉన్నతాధికారికి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

# ఆమెకు ఆత్మరక్షణ విద్య

- అండగా హెల్పింగ్ హార్ట్స్ సంస్థ
- జిల్లా కేంద్రంలోని మహిళలు, విద్యార్థినులకు కర్రసాము, కరాటేలో ఉచిత శిక్షణ
- ఆసక్తి చూపుతున్న అతివలు



కర్రసాములో శిక్షణ పొందుతున్న యువతులు, బాలికలు (ఫైల్)

**ఆమెకు భరోసా దొరికింది. ఆత్మస్థైర్యం పెరుగుతున్నది. మహిళలు, విద్యార్థినులు ఆపత్కాలంలో తమను తాము రక్షించుకునేందుకు సిరిసిల్ల హెల్పింగ్ హార్ట్స్ సంస్థ అండగా నిలుస్తున్నది. అతివలను ధీర వనితలు తీర్చిదిద్దడమే లక్ష్యంగా రెండు నెలలుగా కర్ర సాము, కరాటేలో ఉచిత శిక్షణ ఇస్తున్నది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం, సాయంత్రం వేళల్లో గంటపాటు తర్ఫీదు ఇస్తున్నది. ఇప్పటివరకు 200 మంది ట్రైనింగ్ ఇవ్వగా, రోజురోజుకూ స్పందన పెరుగుతున్నది.**

**- రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ)**



యువతికి పురస్కారాన్ని అందజేస్తున్న జడ్జీ రాధిక జైస్వాల్ (ఫైల్)

నేటి కాలంలో మహిళలకు భద్రత కరువైంది. నిత్యం ఏదో ఒకచోట ఆకతాయిల వేధింపులు, చిల్లర చేష్టలతో ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. ఈ క్రమంలో మహిళలు, విద్యార్థినులకు సిరిసిల్ల హెల్పింగ్ హార్ట్స్ సంస్థ అండగా నిలబడింది. ఆపత్కాలంలో తమను తాము రక్షించునేందుకుగాను కర్ర సాము, కరాటేలో ఉచితంగా శిక్షణ అందించి ధీర వనితలు నిలపాలని సంస్థ ప్రతినిధులు కనుకుంట్ల తిరుమల, అన్నపూర్ణ సంకల్పించారు. ‘ఆమె అబల కాదు సబల’ అని చూపించాలన్న లక్ష్యంతో జిల్లా కేంద్రానికి చెందిన ఏడో తరగతి చదివే బాలిక నుంచి మొదలుకొని పీజీ చదివే విద్యార్థినులందరికీ శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించారు. ‘హర్‌ఘర్ దుర్గా పేరిట’ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండు నెలలుగా కరాటే, కర్రసాములో శిక్షణ అందిస్తున్నారు. ఉదయం, సాయంత్రం గంటపాటు తర్ఫీదు ఇస్తుండగా, మహిళలు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటి వరకు న్యాయవాదులు, టీచర్లు, విద్యార్థినులు, వైద్యులు కూడా దాదాపు 200 మంది విద్య నేర్చుకున్నారు. కాగా, ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు కూడా అందజేస్తున్నారు. మరోవైపు సంస్థ ప్రతినిధి తిరుమల భర్త, సైకాలజిస్టు పున్నం చందర్ సైతం మహిళల ఆత్మహత్యల నివారణకు కృషిచేస్తున్నారు. ఆత్మస్థయిర్యం కోల్పోయి బలవన్మరణాలకు పాల్పడకుండా చైతన్యవంతం అయ్యేలా అవగాహన కల్పిస్తున్నారు.

**కర్రసాముతో ఆత్మస్థైర్యం పెరిగింది.**



నేటి కాలంలో మహిళలకు భద్రత కొంత కరువైంది. ఆకతాయిల వెకిలీ చేష్టలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో ఆపత్కాలంలో తమను తాము రక్షించుకునేందుకు కర్రసాము, కరాటే శిక్షణ అత్యవసరం. ఇవి నేర్చుకోవడం వల్ల ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనే ధైర్యం వస్తుంది. తాను మూడు నెలలుగా కర్రసాము, కరాటేలో శిక్షణ తీసుకున్నా. నాలో ఆత్మస్థయిర్యం పెరిగింది. తాను నేర్చుకున్న కర్రసాము విద్యను10 మందికి నేర్పాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నా. **- బీ కౌసల్య, బ్యుటీషియన్**

**మహిళలందరూ నేర్చుకోవాలి..**



నేను న్యాయవాద వృత్తిలో ఉన్నా. ప్రస్తుతం సమాజంలో మహిళలకు నిత్యం ఎదురవుతున్న సమస్యలు తనను ఎంతగానో బాధించాయి. మానస్థిక స్థయిర్యం లేక అనేక మంది భయం భయంగా బతుకుతున్నారు. వారిలో ఆత్మస్థయిర్యం నింపి, స్ఫూర్తిగా నిలిపేలా చేయాలన్న లక్ష్యంతో కర్ర సాములో ఉచిత శిక్షణ ప్రారంభించాం. యువతులు చాలా ఆసక్తి చూపుతున్నారు. అన్ని వర్గాల మహిళలు ఉత్సాహంగా నేర్చుకుంటున్నారు. శిక్షణ తీసుకున్నవారికి పది మందిని ఎదురించే ధైర్యం వస్తుంది.

**- కనుకుంట్ల తిరుమల, హెల్పింగ్ హార్ట్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది**